# శకుని కొత్త పాచికలు



డాక్టర్ ఎస్వీ జోగారావు

శకునికి రోజుకొక్కసారైనా ఓ యెత్తు వేయకపోతే నిద్రపట్టదు. ఆరోజు అర్ధరాత్రి అయిపోయినా ఎవరూ దొరకలేదు. అతనికి నిద్రపట్టడం లేదు. కనీసం ఆవులింత కూడా రాలేదు. ఊసుపోక చుట్ట కాల్చుకుంటూ కూచున్నాడు. అయితే ఎట్టకేలకు ఒక దౌర్భాగ్యుడు దొరికేడు. రాజభటులు ఒక దొంగను పెద్ద మూటతో సహా తీసుకు వచ్చి ఆయన ముందు హాజరు పెట్టి "ప్రభూ! వీడు మీ మేడ నుండి దిగుతూ వుండగా పట్టుకున్నాం. ఈ మూటలోని నగలని చూస్తే మీ పేరుతో వున్న బంగారు పళ్ళెం, చెంబు దొరికేయి. మీరింకా మేలుకొనే వున్నారని గ్రహించి ముందు మీ వద్దకు తీసుకు వచ్చాం" అని మనవి చేశారు.

దొంగ- "ప్రభూ మీ సరుకులు మీరు తీసుకోండి. మిగతావి నా కష్టార్జితం" అన్నాడు. శకుని- "పాపం! ఈ పళ్ళెం, చెంబూ కూడ నీ కష్టార్జితాలే కదా. ఒకరి కష్టార్జితాన్ని తీసుకోడం నాకిష్టం లేదు. ఒక మాట అడుగుతాను, నిజం చెప్పు. నీకేమైనా వ్యసనం వుందా?" దొంగ- "లోగడ జూదం వ్యసనంగా వుండే దండి. దానివల్ల కిట్టుబాటు కాక ఈ వృత్తిలో పడ్డాను."

శకుని- "అయితే అది నీకు నిజంగా వ్యసనం కాదన్నమాట. బంగారం దొంగతనంలో పడ్డావంటే నీవు పంచమహా పాతకుల్లో వాడివి." దొంగ- "అలా క్కాదండి, ఇప్పటికీ అందులో మంచి ఆరితేరిన వాడినే నండి". "అయితే నాతో ఒక్క పందెం వెయ్యి చూద్దాం! ఆలస్యం దేనికి? ఆ మూటంతా ఒక్కసారే ఒడ్డేసి ఒక్క యెత్తు వెయ్యి" అని శకుని.

దొంగ చిత్తం అని యెత్తువేశాడో లేదో, గోవిందుడు ప్రత్యక్షమయ్యాడు. వాడు గోల. పాపం శకుని కనికరించి ఓ చుట్ట చేతిలో పెట్టి వాడిని వదిలెయ్యమని రాజ భటులకు సిఫారసు చేశాడు.

రాజ భటులు "అలా కుదరదండి, దొంగ దగ్గర సరుకులు దొరక్కపోయినా, దుర్యోధన ప్రభువ్వారి ముందు హాజరు పెట్టవలసిందే నండి" అని మనవిచేసి తీసుకొని పోయారు. మర్నాడుదయం కొలువులో హాజరు పెట్టేరు. దుర్యోధన, దుశ్శాసన కర్ణ శకునులు మాత్రమే ఆసీనులై వున్నారు.

దుర్యోధనుడు సంగతంతా తెలుసుకొని, "మామయ్య ఇంట్లో దొంగతనం చేశావంటే నువ్వు చాలా ఘటికుడివే" అని నవ్వుతూ "నీకేం శిక్ష విధించమన్నావు?" అని అడిగాడు. ప్రభువు ఉల్లాసంగా ఉండటం చూసి "ఏదైనా ఒక గట్టి దొంగతనానికి ఆజ్ఞ దయచెయ్యండి. వెంటనే చూపిస్తాను నా తడాకా" అన్నాడు ధైర్యంగా. "కావలిస్తే చూసుకోండి. మీ పడావులు రెండూ నా సంచిలో వున్నాయి" అని చూపించాడు.

కర్ణుడు "కాలు కింద కన్నం వేసేదే వీడు!" అని ఆశ్చర్యపోయాడు. "అవును బాబయ్య. శకుని మారాజు చేతిలో ఆట ఓడిపొయ్యామగాని, గజకర్ణ గోకర్ణ టక్కుటమార ఇంద్రజాల మహేంద్రజాల విద్యల్లో కూడా ఆరితేరినోణ్ణి, పిల్లోణ్ణి. కటకటాల్లో తోసెయ్య కుండా సెలవియ్యండి" అన్నాడు.

దుర్యోధనుడు కర్ణుడితో ఏదో మంతనం చేశాడు. కర్ణుడన్నాడు సరికదా "ఒరేయ్! అలా అయితే వెంటనే ఆ పాండవుల మయ సభలో ప్రవేశించి అర్జునుడి గాండీవం, భీముడి గదా ఎత్తుకు రావాలి". "చిటికలో వస్తాను మారాజా!" అని చిత్రంగా సత్వరం ఆ రెండూ పట్టుకుని వచ్చేశాడు. సభ సభంతా ఆశ్చర్యచకితులై పోయారు. కాని, దుర్యోధనుడా గదను ముట్టుకొనేసరికి, అది శివలింగమై కూచుంది. కర్ణుడు గాండీవం మీద చెయ్యి మోపేడో లేదో అది పడగెత్తిన పామై ఆ శివలింగాన్ని చుట్టుకుంది. అంతా భయభ్రాంతులై పోయారు శకుని తప్ప. శకుని అన్నాడు-"ఓయ్ చోరాగ్రేసరా! మళ్ళా నువ్వే ఆ మయసభకు వెళ్ళి, భీమార్జునులతో ఇలా జరిగిందని నిజమే చెప్పేసి వాళ్ళనే స్వయంగా వీటిని వచ్చి తీసుకెళ్ళమని చెప్పు".

వాడు పరుగెత్తుకెళ్ళాడు. ఆదరా బాదరా వాళ్ళూ వెంటనే రథారూఢులై వచ్చారు.

"వీడు గజదొంగవని ప్రగల్భాలాడితే పరీక్షిద్దామని తమాషా చేశాం. మరేమీ అనుకోకండి" అన్నాడు శకుని. భీమార్జునులిద్దరు భక్తితో శివుడికి నమస్కారం, ప్రదక్షిణం కూడా చేశారు. లాభం లేకపోయింది. ఎందుకేనా మంచిదని ధర్మరాజు అప్పటికే మయుణ్ణి ఆయత్తపరిచాడు. ఇతగాడెందుకు వచ్చాడా? అని దుష్టచతుష్టయం కళ్ళు జోళ్ళు తగిలించుకుని మరీ చూస్తున్నారు ఆ వింత.

మయుడింకా 'కాళీ కలకత్తావాలీ హూష్ మంత్రగాళీ' అన్నట్టు కూడా ఏమీ అనలేదు. లింగం, పామూ మాయమైపోయి, అక్కడ గదా, గాండీవం దర్జాగా వున్నాయి. భీమార్జునులు నవ్వుతూ "సార్వభౌమా! తీసుకుపొమ్మని సెలవా?" అన్నారు. దుర్యోధనుడు మనస్సులో గుండాపిండీ అయిపోతున్నా, పైకి మర్యాదకి రాజభటులతో "ఇదిగో, మామయ్యగారి మేడకు వెళ్ళి ఆయనకు నేను బహుమానంగా ఇచ్చిన ఆ పాడవాటి రత్నాల పాచికల పెట్టి తీసుకు రండి" అని ఆజ్ఞాపించాడు. దుశ్శాసనుడు స్వయంగా వెళ్ళి పట్టించుకు వచ్చాడు పెట్టెను.

"ఈ రెండూ అందులో పెట్టండి" అని ప్రభువ్వారు హుకుం జారీ చెయ్యగానే, పదిమంది భటులూ, దుశ్శాసనుడితో సహా సాయం పట్టి ఎలాగో రెండింటినీ అందులో భద్రంగా పెట్టారు.

శకుని మాత్రం తన పాచికలను తీసేసుకుని చిరునవ్వు నవ్వుతూ, భీమార్జునులతో "మేనల్లుళ్ళూ! సేన్నాళ్ళకి కనిపించారు. ఉత్తినే వెళ్ళిపోతే బాగుండదు. ఓ యెత్తు వేసి మరీ పొండి" అని ప్రాధేయపడ్డాడు. ఇద్దరూ ఏదో కూడబలుక్కుని సరేనంటూ "మరి పణం?" అని అడిగేరు. ఆ పెట్టె నాది కదా, అదే నాపణం. గదా, గాండీవాలు మీ పణం" అన్నాడు. సరే కానివ్వండంటే కానివ్వండనుకున్నారు. ఎత్తులు వేశారు. భీమార్జునులు ఓడిపోయారు. శకుని పకపకా నవ్వుతూ గదా, గాండీ వాలతోపాటు పాచికలందులో పడేసి, రాజభటులతో "ఒరేయ్! ఈ పెట్టె ఎక్కడనుంచి తెచ్చారో అక్కడే పెట్టేసి తలుపుకు తాళం వేసిరం" డన్నాడు. వాళ్ళు అలా చెయ్యడమే కాకుండా, చెవి కూడా తెచ్చి అతని చేతిలో పెట్టారు. భీమార్జునులు 'సెలవు' అని మళ్ళా రథారూఢులయ్యారు. మయుడూ వాళ్ళను అనుసరించాడు. చతురాస్యములూ 'అమ్మయ్య' అనుకున్నాయి. వాళ్ళూ రథాలూ ఎక్కేరో లేదో శకుని పాచికల పెట్టె మయుడి డిక్కీలో వుంది. నానా గాభరా పడిపోయాడు శకుని. డిక్కీ దగ్గరికి పరిగెత్తి మయుడితో "బాబ్బాబూ! నీకో నమస్కారం. నీ ముందు నేనేపాటివాడిని? పెట్టె తీసుకున్నా ఫరవా లేదు, నా పాచికలిచ్చెయ్. నీకు పుణ్యముంటుంది" అని కాళ్ళావేళ్ళా పడ్డాడు. భీమార్జునుల వైపు చూశాడు మయుడు. "అతడు వేలు విడిచినవాడే అయినా వరసకు మేనమామే కదా మాకు. పెద్దవాడైనా మాకూ నమస్కారం చేసేశాడు. ఇచ్చెయ్ వెధవ పాచికలు" అన్నారు భీమార్జునులు. ఇచ్చేశాడు మయుడు. పాచికలందుకుంటూ, "వెధవ పాచికలా!" అని ఈసడించాడు శకుని. "అదే సమాసమవుతుందో ఆలోచించుకో" అన్నాడు మయుడు. ఏదో అర్థమైనట్లు గజదొంగ కూడా నవ్వేశాడు.